సాక్షి
తిరుపతి

మంగళవారం । 4 । జూన్ । 2024



శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరికి అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. - 8లో



వివాదాలొద్దు

ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఏజెంట్లు వివాదాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే భూమన పిలుపునిచ్చారు. - 8లో



మృత్యుంజయ పూజలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం మృత్యుంజయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. క్యూకాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 83,740 మంది స్వామివారిని దర్శించుకోగా 35,462 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.71 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వ్యవసాయ డిప్లొమో కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించే వ్యవసాయ పాలిటెక్నికల్ డిప్లొమో కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీ.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థుల వయస్సు ఆగస్టు 31 నాటికి 22 సంవత్సరాలకు లోబడి ఉండాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, మున్సిపాలిటీ పరిధిలోని విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 20లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, మరిన్ని వివరాల కోసం 0877-2249909, 9618167187 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద ప్రథమ చికిత్స కేంద్రం



ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి

తిరుపతి తుడా: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటల నుంచి అక్కడ ఎన్నికల సిబ్బంది, ఏజెంట్లు సైతం హాజరు కానున్నారు. ఈ క్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి ఆధ్వర్యంలో మహిళా విశ్వవిద్యాలయంలోని కౌంటింగ్ కేంద్రం వద్ద ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆయన సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు వైద్యులు వైద్య సిబ్బంది అత్యవసర చికిత్సకు అవసరమైన మందులతోపాటు అంబులెన్స్ సిద్ధంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

నేడే తీర్పు

21 రోజుల నిరీక్షణకు తెరపడనుంది. ఎన్నికల రణరంగంలో ఆఖరి ఘట్టం ఆసన్నమైంది. మంగళవారం ఉదయం సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రారంభం కానుంది. అభిమానులు, అభ్యర్థుల టెన్షన్‌కు తెరపడనుంది. విజయతీరాలకు చేరేదెవరో.. ఓటమి అంచుకు వెళ్లేదెవరో తేలిపోనుంది. ఈ మేరకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. అభ్యర్థులను ఇంటి వద్ద దింపేంతవరకు ఎస్కార్ట్ భద్రత కల్పించనుంది.

ఈ రోజే 'నే'తల' రాత మారేది

- సర్వత్రా ఉత్కంఠ
- బరిలో 177మంది అభ్యర్థులు
- ఏజెంట్లకు ధ్రువపత్రాలు తప్పనిసరి
- ఫస్ట్ సత్యవేడు..లాస్ట్ వెంకటగిరి ఫలితం
- మద్యం తాగితే నో ఎంట్రీ

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. శ్రీపద్మావతి మహిళా కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఉదయం నుంచే కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేశారు. గత నెల 13వ తేదీన పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో పూర్తిచేశారు. ఆ తర్వాత కౌంటింగ్‌కు 21 రోజుల సమయం ఉండడంతో ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టారు. కౌంటింగ్‌పై సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన కల్పించారు.

కౌంటింగ్ ఇలా..

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అధికార యంత్రాంగం అనేక ఫారాలు వినియోగిస్తోంది. వీటిల్లో ప్రతి ఫారానికి ఒక ప్రాధాన్యం ఉంది. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఒకేసారి చేపట్టనున్నారు. ఫలితాల బటన్ నొక్కగానే ప్రతి అభ్యర్థికీ పోలైన ఓట్లు ఈవీఎంలో కనిపిస్తాయి. ప్రతి రౌండ్ లెక్కింపునకు ముందు కౌంటింగ్ ఏజెంట్లతో 17-సీ ఫామ్‌లో తప్పనిసరిగా సంతకాలు తీసుకుంటారు. రౌండ్ల వారీగా ఫలితాలను ఫామ్-20లో నమోదు చేసి కంట్రోల్ రూమ్, మీడియా కేంద్రాలకు పంపిస్తారు. సువిధ యాప్‌లో నమోదు చేసిన తరువాత మాత్రమే రౌండ్ల వారీ ఫలితాన్ని అధికారికంగా ప్రకటిస్తారు.

తాగి ఊగితే నో ఎంట్రీ

- కౌంటింగ్ కేంద్రం వద్ద రాజకీయ పార్టీల ఏజెంట్లకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహిస్తారు.
- ఆల్కహాల్ పర్సంటేజ్ ఉన్నట్లు చూపితే కేంద్రంలోకి అనుమతించరు.
- ఉదయం 6 గంటలకల్లా ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకోవాలి.
- పార్టీ కార్యకర్తలను కౌంటింగ్ కేంద్రాల వద్దకు తీసుకు రాకూడదు.
- కౌంటింగ్ కేంద్రాల బయట, రోడ్లపై విజయోత్సవ ర్యాలీలు నిషేధం.
- బాణసంచా కాల్చకూడదు. ఫంక్షన్ హాల్స్, హోటల్స్‌లో జనసమీకరణ చేపట్టరాదు.
- వాట్సాప్ గ్రూప్‌లు, ఇతర సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెట్టకూడదు.
- ఇతర పార్టీ కార్యాలయాలు, నాయకుల ఇళ్ల వద్ద కవ్వింపు చర్యలకు దిగకూడదు.
- ఓడిపోయిన అభ్యర్థులపై వ్యంగ్యాస్త్రాలు సంధించరాదు.
- 6వ తేదీవరకు ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు చేయకూడదు.
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు తప్పవు.

బరిలో ఉన్న అభ్యర్థులు

నియోజకవర్గం	అభ్యర్థుల సంఖ్య
తిరుపతి పార్లమెంట్	24
గూడూరు అసెంబ్లీ	15
సూళ్లూరుపేట	14
వెంకటగిరి	10
చంద్రగిరి	26
తిరుపతి	48
శ్రీకాళహస్తి	23
సత్యవేడు	17
మొత్తం	177



శ్రీపద్మావతి కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	రౌండ్లు	ఫలితం వెలువడే సమయం (సాయంత్రం)
గూడూరు	294	21	3.50
సూళ్లూరుపేట	304	22	4.10
వెంకటగిరి	299	22	4.10
తిరుపతి	274	20	3.30
శ్రీకాళహస్తి	293	21	3.50
సత్యవేడు	279	20	3.30
చంద్రగిరి	397	20	3.30

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం రెండో దశ ర్యాండమైజేషన్ పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ నిర్వహణ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో చేపట్టనున్న నేపథ్యంలో కౌంటింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టినట్టు తెలిపారు. కౌంటింగ్ అబ్జర్వర్లు ఉజ్వల్ కుమార్‌ఘోష్ (తిరుపతి, సూళ్లూరుపేట నియోజకవర్గం), కైలాస్ వాంఖడే (చిత్తూరు పార్లమెంట్ చంద్రగిరి నియోజకవర్గం), జ్యోతి (గూడూరు, సత్యవేడు నియోజకవర్గం), జ్యోత్స్న విద్యాసాగర్ హిరాముఖే పడియార్ (వెంకటగిరి, శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజక వర్గాలు)సమక్షంలో పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 996 మంది సిబ్బందిని కౌంటింగ్‌కు కేటాయించినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం కౌంటింగ్ సిబ్బంది మూడో ర్యాండమైజేషన్ చేయనున్నట్టు వెల్లడించారు. సమావేశంలో కౌంటింగ్ పోలీస్ పరిశీలకులు ఐజీ మోహన్‌రావు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, రిటర్నింగ్ అధికారులు, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, మాన్ పవర్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి చంద్రశేఖర్ నాయుడు, ఎన్ఐసీ డీఐఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసుల పహారా



కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసుల పహారా

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ పూర్తిచేయడానికి అన్ని చర్యలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ ధ్యాన్‌చంద్రతో కలసి కౌంటింగ్ కేంద్రమైన శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ భవనాల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. అదే ప్రాంతంలో అధికారులతో సమావేశమయ్యారు. ఎలాంటి హింసాత్మక ఘటనలకు తావులేకుండా పోలీసు శాఖ ద్వారా భద్రతా ఏర్పాట్లు పూర్తిచేసిందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో మొదలు అవుతుదని, 8.30 గంటలకు ఈవీఎంలను ఓపెన్ చేస్తామని తెలిపారు. ఉదయం 7 గంటలకు అబ్జర్వర్లు, అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూంలను తెరవనున్నట్టు వెల్లడించారు. తిరుపతి పార్లమెంట్‌కు సంబంధించి పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి మొత్తం 14 టేబుళ్లు, 3 రౌండ్లలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టినట్టు కలెక్టర్ తెలిపారు. సాయంత్రం 4గంటలకు ఫలితాలు వెల్లడిస్తామన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 22,795

జిల్లాలో మొత్తం పోస్టల్ బ్యాలెట్ 22795 ఓట్లు లెక్కించాల్సి ఉంటుందని, దీనికి మొత్తం 28 టేబుళ్లు ఏర్పాటు చేసి.. 15 రౌండ్లలో లెక్కింపు పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. రిటర్నింగ్ అధికారి సూచనల మేరకు పోలీసుల చర్యలు ఉంటాయని, ఈ విషయాలన్నీ సీసీటీవీలో రికార్డు అవుతాయని తెలిపారు. ఉదయం 5.15 గంటలకు మూడో ర్యాండమైజేషన్ చేపట్టనున్నట్టు వెల్లడించారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ పాల్గొన్నారు.

ఇవి నిషేధం

- కౌంటింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్ అనుమతి లేదు.
- జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో జనం గుమికూడరాదు.
- రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో బాణసంచా పేల్చడం నిషేధం.
- విజయోత్సవ ర్యాలీలు చేపట్టరాదు.

కూటమితో కుమ్మక్కు!

కూటమి నేతలతో కొందరు అధికారులు కుమ్మక్కయ్యారా.. కౌంటింగ్‌కు తమకు అనుకూలమైన అధికారులను వేయించుకున్నారా..? నేడు జరగనున్న ఓట్ల లెక్కింపులో అక్రమాలు.. దౌర్జన్యాలకు స్కెచ్ వేశారా..? అంటే జిల్లా వాసుల నుంచి అవుననే సమాధానం వస్తోంది. కౌంటింగ్‌లో కూటమి అభ్యర్థులు పైచేయి సాధించేందుకు కొందరు అధికారులు అడ్డదారులు తొక్కేందుకు సిద్ధమైనట్టు స్పష్టమవుతోంది.

కౌంటింగ్‌లో కొట్లాటకు స్కెచ్

- అనుకూలమైన అధికారులకు డ్యూటీలు
- పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో అడ్డదారులు
- ఈవీఎంలో మొత్తం ఓట్ల లెక్కింపులోనూ అక్రమాలు
- కాంగ్రెస్ ఏజెంట్ ఫామ్స్‌ని చేజిక్కించుకున్న కూటమి నేతలు
- ఏజెంట్ల నియామకం విషయంలో స్వతంత్ర అభ్యర్థులకు మొండిచేయి
- కూటమి నేతల కనుసన్నల్లో కొందరు అధికారులు బరితెగింపు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కౌంటింగ్‌లో అక్రమాలు.. దౌర్జనాలకు కూటమి అభ్యర్థులు పక్కా ప్రణాళికలు రూపొందించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి ఇచ్చిన ఆదేశాలను ఆసరాగా చేసుకుని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు కూటమి నేతలు కొందరు అధికారుల సహకారంతో రంగం సిద్ధం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అందుకు స్వతంత్ర అభ్యర్థులు అడ్డొస్తారని వారికి ఏజెంట్లను కుదించడమే ఇందుకు నిదర్శనం. తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ, చిత్తూరు ఎస్వీ సెట్‌లో నేడు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. కూటమికి ఓటమి తప్పదని భావించిన అభ్యర్థులు టీడీపీ సానుభూతిపరులైన అధికారుల ద్వారా మరికొందరు అధికారులను రకరకాల ప్రలోభాలతో లోబరుచుకున్నారు. వారందరికీ కౌంటింగ్ కేంద్రంలో డ్యూటీలు వేయించుకున్నట్లు పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. వారి సహకారంతో కౌంటింగ్ కేంద్రంలో అక్రమాలు, దౌర్జన్యాలకు దిగేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

వీలైనన్ని పోస్టల్ బ్యాలెట్ ఓట్లే లక్ష్యంగా..

అధికారులంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని ప్రచారం చేసిన కూటమి నేతలు.. నేడు జరగనున్న కౌంటింగ్‌లో దాన్ని అవకాశంగా వినియోగించుకోవాలని కుయుక్తులు పన్నుతున్నట్టు స్పష్టమవుతోంది. ఇందులో భాగంగా ఈసీ ఆదేశాలను బూచీగా చూపి వీలైనన్ని పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కూటమి అభ్యర్థికి అనుకూలంగా మలచుకునేందుకు పథకం వేసినట్టు సమాచారం. అందుకు అడ్డుగా ఉన్న వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను రెచ్చగొట్టి బయటకు పంపేందుకు స్కెచ్ వేసినట్లు ప్రచారం జరుగుతోంది. అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్ల విషయంలోనూ ముందే అడ్డుకట్ట వేశారు. టేబుల్‌కి ఒక ఏజెంట్‌ని నియమించుకునే అవకాశం అభ్యర్థి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. గుర్తింపు పొందిన పార్టీలకు మాత్రమే టేబుల్‌కి ఒక ఏజెంట్‌ని ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారు. స్వతంత్ర అభ్యర్థుల విషయానికి వచ్చేసరికి కేవలం 5, 6 మంది ఏజెంట్లను మాత్రమే నియమించుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని స్వతంత్ర అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము అభ్యర్థే కదా? అన్నీ టేబుల్స్ వద్ద ఏజెంటు ఉండకపోతే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. అయినా వారికి ఎన్నికల అధికారి ససేమిరా అన్నట్లు స్వతంత్ర అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తారుమారు చేసి.. కూటమికి అనుకూలంగా మార్చే కుట్ర

అడ్డదారుల్లోనైనా గెలుపొందాలని కూటమి నేతలు అన్ని మార్గాలను ఎంచుకున్నారు. ఈవీఎంలో పోలైన ఓట్ల లెక్కింపు సమయంలో కూటమి ఏజెంట్లు రచ్చచేసి వైఎస్సార్‌సీపీ ఏజెంట్ల దృష్టి మరల్చేందుకు పథకం వేసినట్లు తెలిసింది. ఈవీఎంలోని మొత్తం ఓట్ల లెక్కింపు విషయంలో తమకు అనుకూలంగా లెక్కలను తారుమారు చేసేందుకు స్కెచ్ వేసినట్లు సమాచారం. మొత్తంగా నేటి కౌంటింగ్ సమయంలో అడ్డదారులన్నింటినీ ఉపయోగించుకుని పైచేయి సాధించేందుకు కూటమి నేతలు కుట్రలకు పదునుపెట్టారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు కౌంటింగ్ కేంద్రంలో అక్రమాలు, దౌర్జనాలకు తావు లేకుండా గట్టి చర్యలు తీసుకోవాలని అధికారులు, ఓటర్లు కోరుతున్నారు.

బలగం కోసం కొత్త ఎత్తుగడ

కౌంటింగ్ కేంద్రలో అక్రమాలు, దౌర్జన్యాలకు బలగం ఉండేలా కూటమి అభ్యర్థులు కాంగ్రెస్ ఏజెంట్ ఫామ్స్‌ని కొనుగోలు చేసుకున్నట్లు ఆరోపణలు గుప్పుమన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగైనా ఆ పార్టీ తరుపున అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. జాతీయ పార్టీ కావడంతో కాంగ్రెస్ అభ్యర్థికి టేబుల్‌కి ఒకరు చొప్పున ఏజెంట్‌ని నియమించుకునే అవకాశం ఉంది. పేరుకు మాత్రమే పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి తమ ఏజెంట్ ఫామ్స్‌ని కూటమి అభ్యర్థులకు విక్రయించి సొమ్ముచేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాంగ్రెస్ ఏజెంట్ ఫామ్స్‌తో కూటమి నేతలు కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించనున్నారు. కౌంటింగ్ కేంద్రంలో కూటమి నేతలకు బలం ఎక్కువ ఉండడంతో అక్రమాలు, దౌర్జన్యాలు చేసేందుకు అవకాశం ఉన్నట్లు అధికారులు కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ బలగంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వీలైనన్ని కూటమి అభ్యర్థి లెక్కలో వేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో ఏ చిన్న పొరబాటు ఉన్నా.. కూటమి అభ్యర్థి అకౌంట్‌లో వేసేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు.

వైఎస్సార్‌సీపీదే విజయం



మాట్లాడుతున్న వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

తిరుపతి సిటీ: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయమని, ఇందులో ఎటువంటి సందేహం లేదని వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. పద్మావతి మహిళా వర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరన్నారు. తెలుగుదేశం పార్టీ ఎగ్జిట్‌పోల్ పేరుతో కొందరితో అబద్ధాలను చెప్పిస్తోందని విమర్శించారు. తాము ఎవరినీ బలవంత పెట్టలేదని, ప్రజలకు చేసిన మంచి పనులే తమను గెలిపిస్తాయని చెప్పారు. 6వ తేదీ రావలసిన రుతుపవనాలు 4వ తేదీ ముందే రాష్ట్రానికి వచ్చాయని, ఇప్పటికే వర్షం రూపంలో దేవుడు తమను ఆశీర్వదించాడన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 9వ తేదీన విశాఖపట్టణంలో రెండో సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారని చెప్పారు. టీడీపీ ఇచ్చిన హామీలను ఒక్కటంటే ఒక్కటి కూడా నిలబెట్టుకోలేదని, అందుకే 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 151 స్థానాలు ఇచ్చి రాష్ట్ర ప్రజలు సీఎంను చేశారన్నారు. గతం కంటే ఎక్కువ సీట్లు వైఎస్సార్‌సీపీ సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఫుట్‌బాల్ విజేత నెల్లూరు


నెల్లూరు జట్టు క్రీడాకారులతో నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం తుమ్మలగుంటలో జోనల్ స్థాయి జూనియర్ బాలుర ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లా జట్లు పాల్గొన్నాయి. రౌండ్ రాబిన్ లీగ్ పోటీలుగా స్టేట్ క్వాలిఫైడ్ రెఫరీలు రాజీవ్, శామ్యూల్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో నెల్లూరు జిల్లా జట్టు విజేతగా, తిరుపతి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. నెల్లూరు జట్టు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి(డీఎస్‌డీఓ) ఎస్.సయ్యద్ సాహెబ్ తెలిపారు. కోచ్‌లు వినోద్, రమేష్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఏ.రెడ్డెప్ప పాల్గొన్నారు.

వివాదాలకు దూరంగా ఉండండి


ఏజెంట్లకు సూచనలిస్తున్న తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి అర్బన్: ఎన్నికల కౌంటింగ్‌లో వివాదాలకు ఏజెంట్లు దూరంగా ఉండాలని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సూచించారు. సోమవారం ఆయన తన నివాసంలో తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్, మేయర్ డాక్టర్ శిరీషాతో కలసి కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ నిర్వహించడానికి అధికారులకు పూర్తిగా సహకరించాలన్నారు. కూటమి వారు దురుసుగా మాట్లాడినా సర్దుకుపోయేలా వ్యవహరించాలని చెప్పారు. ఎన్నికల నిబంధనలు వంద శాతం పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో సినిమా షూటింగ్


తిరుపతిలో నటీనటులు, కళాకారులు

తిరుపతి కల్చరల్: ధర్మ క్రియేషన్స్ పతాకంపై ప్రొడక్షన్ నంబర్-1 ఆధ్వర్యంలో నిర్మించనున్న కొత్త చిత్రం వెంకటనరసింహరాజువారి పేట రైల్వేస్టేషన్ సినిమా షూటింగ్ సోమవారం కోటకొమ్మల వీధిలోని ఓ ఇంటిలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు శ్రీధర్ వర్మ మాట్లాడుతూ సరికొత్త జోన్‌లో సస్పెన్స్, థ్రిల్లర్, హార్రర్‌తో కూడిన కథతో సినిమా రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి తిరుపతి, మామండూరు పరిసర ప్రాంతాల్లో ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ చేపట్టి రెండు షెడ్యూల్‌లలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రధానపాత్రలో తిరుపతికి చెందిన భీమాస్ అశోక అభి, గగన, సునీల్, వినుకొండ రవి, క్రిస్టోఫర్లు నటించగా, ఇతర పాత్రలో షీలా, కామెడి శాస్త్రి, హరి, శ్రీనివాసులతో పాటు పేద కళాకారులకు సైతం అవకాశం కల్పించి వారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం అనిల్, సినిమా ఫొటోగ్రఫీ నటరాజ్, ఎడిటింగ్ వీఎఫ్ఎక్స్ ధ్యాను, కోడైరెక్టర్ రామస్వామి, అసోసియేట్ డైరెక్టర్‌గా సుధీర్, మేకప్ కిషోర్, వ్యవహరిస్తారని తెలిపారు.

మధ్యవర్తిత్వంపై జడ్జిలకు అవగాహన


శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న జిల్లా జడ్జి భీమారావు

తిరుపతి లీగల్: రాష్ట్ర ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయసేవ సంస్థలు, తిరుపతి మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో రాయలసీమ జిల్లాల్లోని 30 మంది న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ఆవరణలోని శ్వేత భవన్‌లో సోమవారం అవగాహన తరగతులు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి భీమారావు సోమవారం ఉదయం శిక్షణ తరగతులను ప్రారంభించారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలకు చెందిన 30 మంది న్యాయమూర్తులు ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొన్నారు. డిల్లీ జిల్లా జడ్జి నీరిజిబటియా, కర్ణాటకకు చెందిన సీనియర్ ట్రైనర్ సుశీల న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వం ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి మండల న్యాయసేవా సంస్థ చైర్మన్ గురునాథ్ పాల్గొన్నారు. ఈ శిక్షణ తరగతులు ఈనెల 7వ తేదీవరకు జరుగనున్నాయి.

మధ్యవర్తిత్వంతో న్యాయవాదులకు ఉపయోగం


మాట్లాడుతున్న సీనియర్ ట్రైనర్ సుశీల

మధ్యవర్తిత్వం నిర్వహించడం ద్వారా న్యాయవాదులకు అన్ని విధాల ఉపయోగంగా ఉంటుందని కర్ణాటక న్యాయవాది, సీనియర్ ట్రైనర్ సుశీల తెలిపారు. కేసులను పరిష్కరించాలంటే న్యాయవాదులు అనేక టెన్షన్లు పడాల్సి ఉంటుందన్నారు. మధ్యవర్తిత్వం నిర్వహించి కేసు పరిష్కరించినట్లైతే న్యాయవాదికి ఫీజుతో పాటు ఇతర టెన్షన్లు పోతాయన్నారు. న్యాయవాదులు సామాజిక ఇంజినీర్లు అని, కేసులను పరిష్కరించడంతో ఇరు పార్టీలు ప్రశాంతంగా జీవిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి వదో అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, జిల్లా న్యాయ సేవా సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శి రవి, తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గోపీచంద్, ప్రధాన కార్యదర్శి జోసఫ్ మార్టిన్లు పాల్గొన్నారు.

హనుమంతునికి

పుష్పాభిషేకం


పుష్పాభిషేకంలో హనుమంతుడు

చిల్లకూరు: హనుమజ్జయంతి పురస్కరించుకుని మంగళవారం తీర ప్రాంతంలోని తమ్మినపట్నంలో వెలసి ఉన్న పురాతన ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి పుష్పాభిషేకం నిర్వహించారు. గత మూడు రోజులుగా నిర్వహించిన హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా చివరి రోజున ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, తమలపాకుల ఆరాధన, అనంతరం తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం చందనాలంకారం, పూలంగి సేవ చేపట్టారు.


హనుమజ్జయంతి సందర్భంగా అర్చనలు చేస్తున్న ఉభయకర్తలు

అక్రమ మద్యం స్వాధీనం

చంద్రగిరి: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు చంద్రగిరి పోలీసులు తెలిపారు. ఈ ఘటన సోమవారం మండల పరిధిలోని నారావారిపల్లి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు.. చిన్నారామాపురం పంచాయతీ, భీమవరం గ్రామానికి చెందిన మునిశేఖర్ నాయుడు అలియాస్ బుల్లినాయుడు తన ద్విచక్ర వాహనంలో అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్నాడు. ఈ క్రమంలో నారావారిపల్లి వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేయడంతో మునిశేఖర్ నాయుడు ద్విచక్ర వాహనంలో సుమారు 15 మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ అనిత తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం


షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

నాగలాపురం: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని కార్మికశాఖ తిరుపతి సహాయక కమిషనర్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేస్తున్నారు. సోమవారం నాగలాపురం పట్టణంలో జిల్లా టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో హోటళ్లు, జనరల్ స్టోర్స్, రెడీమేడ్ దుకాణాలు, బేకరీలు, వివిధ షాపుల్లో తనిఖీలు చేశారు. షాపు యాజమానులకు బాల కార్మిక వ్యవస్థ చట్టాల పై అవగాహన కల్పించారు. 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టడం చట్టరీత్య నేరమని కృష్ణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ అధికారి జి.రంగనాథ్, శ్రీకాళహస్తి సహాయక కార్మిక అధికారి కె.కల్పన, సర్వ శిక్ష అభియాన్ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు




ఆలయం ఎదుట కర్ణాటక ఎంపీ, సినీ నటి సుమలత, నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్ మనీష్ కుమార్ షా, ఫారెస్ట్ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం ప్రభుత్వ విప్ శ్రీకాంత్‌రెడ్డి, ఫారెస్ట్ పీసీసీఎఫ్ చిరంజీవిచౌదరి, కర్ణాటక ఎంపీ, సినీ నటి సుమలత, నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డ్ చైర్మన్ మనీష్‌కుమార్‌షా, కేంద్ర మాజీ మంత్రి రేణుకచౌదరి, ఐపీఎస్ అధికారి పరమేశ్వర్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, ఐపీఎస్ అధికారి పరమేశ్వర్‌రెడ్డి

బంజారా జాతికే ఆదర్శం హథీరాం బావాజీ

- ప్రపంచంలోనే ప్రప్రథమ విగ్రహం అద్భుతం
- ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి
- కేరళ రాష్ట్ర ఐజీ గూగులోత్ లక్ష్మణ్‌నాయక్


పూజలు చేస్తున్న కేరళ ఐజీ గూగులోత్ లక్ష్మణ్‌నాయక్


ఐజీ గూగులోత్ లక్ష్మణ్ నాయక్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తిరుపతి రూరల్: సాక్షాత్తు కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామితో పాచికలాడిన హథీరాం బావాజీ బంజారా జాతికే ఆదర్శప్రాయులని కేరళ రాష్ట్ర పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్(ఐజీ) గూగులోత్ లక్ష్మణ్ నాయక్ కొనియాడారు. ప్రపంచంలోనే ప్రప్రథమంగా శ్రీవారి పాదల చెంత ఏర్పాటు చేసిన హథీరాం బావాజీ విగ్రహం అద్భుతమని పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలం, వేదాంతపురంలో నిర్మించిన హథీరాం బావాజీ ఆలయాన్ని సోమవారం ఆయన సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయం వద్దకు చేరుకున్న గూగులోత్ లక్ష్మణ్ నాయక్‌కి హథీరాం బావాజీ మఠ్ పరిరక్షణ సమితి కన్వీనర్ శివనాయక్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆలయం వద్ద ఆయన కమిటీ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో బంజారా జాతికి చెందిన వారు 15 కోట్ల మంది ఉన్నారని, అందరూ సంవత్సరంలో ఏదో రోజు తిరుమల వచ్చి బాలాజీ దర్శించుకుని హథీరాం బావాజీ మఠాన్ని సందర్శస్తారని తెలిపారు. బంజారాలు మఠంలో మాత్రమే వసతి పొందుతారని, కానీ ప్రస్తుతం మఠంలో సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలకోట్ల ఆస్తులున్న మఠంలో హథీరాం బావాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఏళ్ల తరబడి కోరుతున్నామని, అధికారులు, దేవదాయశాఖ స్పందించకపోవడంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బంజారా జాతి ప్రజలందరూ కలిసి మఠం భూమిలోనే ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆలయానికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఆలయ కమిటీ కన్వీనర్ శివనాయక్, సభ్యులు ప్రభాకర్‌నాయక్, కిషోర్‌నాయక్, కుసుమహరి, హరిప్రసాద్‌నాయక్, ప్రసాద్‌నాయక్ పాల్గొన్నారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.73,900
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,619
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.92,500
రిటైల్ వెండి గ్రాము	రూ.94.50

బాలికపై లైంగిక దాడికి యత్నం!

గూడూరు రూరల్: గూడూరు రెండో పట్టణ పరిధి, గాంధీనగర్‌లోని ప్రశాంత్‌నగర్ ప్రాంతానికి చెందిన తొమ్మిదేళ్ల బాలికపై అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు లైంగిక దాడికి యత్నించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు సమాచారం మేరకు.. ప్రశాంతనగర్ ప్రాంతంలో సోమవారం వీధిలో తోటి పిల్లలతో కలసి ఆడుకుంటున్న సమయంలో యువకుడు మాయ మాటలు చెప్పి బాలికను పక్కకు తీసికెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. దీంతో బాలిక కేకలు వేయడంతో యువకుడ్ని పట్టుకుని దేహశుద్ధి చేసి చెట్టుకు కట్టేసినట్లు తెలిపారు. అయితే ఈ విషయంపై రెండో పట్టణ పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మద్యం స్వాధీనం

కోట: కోట మెయిన్ రోడ్డు వద్ద సోమవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు వాకాడు ఎస్ఈబీ సీఐ శ్రీనివాసులు తెలిపారు. కోటకు చెందిన గుర్రం పెంచలయ్య, వెంకటకిష్టయ్యను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న 18 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశామన్నారు.

అది అవాస్తవం

చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గంలో మారణాయుధాలతో రౌడీ మూకలు తిరుగుతున్నారన్న వార్త పూర్తిగా అవాస్తమని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం సాయంత్రం ఓ ప్రటన విడుదల చేశారు. జీవనోపాధి కోసం మంగళూరులో చేపల వేటకు వెళ్లి సీజన్ ముగియడంతో టెంపో ట్రావెలర్ వాహనంలో తిరిగి సొంత గ్రామానికి వస్తుండగా చిత్తూరు - తిరుపతి జాతీయ రహదారిపై పాకాలవారి పల్లి చెక్ పోస్టు వద్ద పోలీసులు జరిపిన వాహన తనిఖీలలో 29 ఫుల్ బాటిళ్ల మద్యం, 26 టిన్ బీర్ బాటిళ్ల మద్యం, ఎండు చేపలు, పచ్చి చేపలు, చేపలు కోయడానికి ఉపయోగించే 2 కత్తులు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కావలి రూరల్ మండలానికి చెందిన 13 మందిని అదుపులోకి తీసుకుని, చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. మారణాయుధాలు, మద్యం బాటిళ్లు కలిగి రౌడీ మూకలు చంద్రగిరి నియోజకవర్గంలో తిరుగుతున్నారంటూ తప్పుడు వార్తను వాట్సాప్ గ్రూపులో పోస్టింగులు పెట్టారని తెలిపారు. ఇలా తప్పుడు పోస్టు పెట్టిన వ్యక్తితో పాటు గ్రూప్ అడ్మిన్ పై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన ఆ ప్రకటనలో హెచ్చరించారు. చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురి కావాల్సిన అవసరం లేదని, శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని ఎస్పీ పేర్కొన్నారు.

రమాదేవిలో రైతుకు

అరుదైన శస్త్రచికిత్స


రోగి సుధాకర్‌రెడ్డితో డాక్టర్ శశిధర్‌రెడ్డి, వైద్యుల బృందం

తిరుపతి తుడా: తిరుపతిలోని శ్రీరమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఈఎన్‌టీ సమస్యతో బాధపడుతున్న రైతుకు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆ ఆసుపత్రి అధినేత డాక్టర్ శశిధర్‌రెడ్డి మీడియాకు తెలిపారు. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో రైతు సుధాకర్‌రెడ్డితో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు నెలలుగా బాధితుడికి ముక్కులో నీరు కారడం, తీవ్ర తలనొప్పి, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది, ముక్కులో నుంచి చెడు వాసన వస్తుండడంతో తమ ఆసుపత్రికి వచ్చారని అన్నారు. ఎంఆర్ఐ స్కాన్ ద్వారా సమస్యను గుర్తించినట్లు చెప్పారు. శస్త్రచికిత్స అవసరం ఉండడంతో ఎండోస్కోపి ప్రక్రియ ద్వారా అతి క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఖరీదైన ఈ వైద్యాన్ని ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేసినట్లు ఆయన తెలిపారు. మరో కేసులో గుర్రంకొండకు చెందిన సురేష్ గడిచిన ఐదేళ్లుగా ముఖం వాయడం తీవ్రమైన తలనొప్పి సమస్యతో బాధ పడుతున్నారని చెప్పారు ఆయనకు ఈఎన్‌టీ విభాగంలో మెరుగైన వైద్యాన్ని అందించామని తెలిపారు. వైద్య సేవలు అందించిన ఈఎన్‌టీ డాక్టర్ వంశీకృష్ణతేజ, ఇతర వైద్యుల బృందాన్ని ఆయన అభినందించారు.